# మిత్రమా... మన్నించు...

**దా**రికడ్డంగా కూర్చుని కార్డ్సు ఆడుకుంటున్న మిత్రబృందాన్ని దాటుకుంటూ వెళ్ళి గదిలో ఒకవారగా ఉన్న మంచంపై నాగేంద్ర పడుకున్నాడు. సీరియస్‌గా సీలింగ్‌కేసి చూస్తూ పడుకున్న అతనివేపు అంతా తలలుతిప్పి ఒక క్షణం చూశారు.

"ఏంట్రా... అలా ఆముదం తాగిన మొహం పెట్టావ్, ఏమయింది?" నరహరి అడిగాడు. ఫోజు మార్చకుండానే గట్టిగా నిట్టూర్చి చెప్పాడు – "ప్రతి బియ్యపు గింజమీదా తినేవాడి పేరు రాసిపెట్టి వుంటుందట! అలాగే ఏ రోజు ఏం అనుభవించాలో మన నుదుటిమీద ముందే రాసిపెట్టి ఉంటుంది కాబోలు! లేకపోతే ఎప్పుడూలేంది నేనివాళ ఆ పి.పి.గాడి రూమ్‌కెందుకెళ్ళాలీ..."

"గది గోడలు కంపించేటంత గట్టిగా అలా సీరియస్‌గా నిట్టూర్చే బదులు విషయం ఏమిటో వివరిస్తే సంతోషిస్తాం" శర్మ చిరాకు పడ్డాడు.

నాగేంద్ర లేచి కూర్చుని వివరించాడు – "నేనిక్కడకు వస్తూ మధ్యలో పి.పి.గాడి రూమ్‌కెళ్ళా. వాడు యథాప్రకారం టేబుల్ ముందు కూర్చుని పుస్తకంలో తలదూర్చి రుబ్బేస్తున్నాడు. 'రెండు వందలుంటే సర్దుతావా?' అనడిగా... జేబులో నుండి డబ్బుతీస్తూ 'బుక్స్ ఏమైనా కొనాలా... లేక మెస్‌బిల్ కట్టటానికి తగ్గిందా' అనడిగాడు. నేను సిన్సియర్‌గా నిజమే చెప్పా. 'మూడు నెలల నుండీ లైనేస్తున్న అమ్మాయి ఈ రోజు తనని చూసి నవ్విందని కె.ఆర్.తాజ్‌లో డిన్నరిస్తున్నాడు. వాడిదగ్గరున్నది సరిపోకపోతే అవసరానికుంటుందని నన్నూ ఓ అయిదొందలు తెమ్మన్నాడు. నా దగ్గిర మూడే ఉన్నాయని నిన్నడిగా' అన్నా. నా మాటలు పూర్తయీ అవకముందే వాడు డబ్బు జేబులో పెట్టేసుకుని

'సారీ రా... నా దగ్గిరా నా ఖర్చులుకి సరిపడా మాత్రమే ఉన్నాయి. రేపు ఎప్పుడైనా నా అవసరానికి ఇబ్బందిపడాల్సి వస్తే, నీకు ముఖ్యమైన అవసరానికిచ్చాను గదా అనే సంతృప్తి కలగాలి గానీ, జల్సా చేయటానికిచ్చి నేనవసరంగా ఇబ్బంది పడుతున్నాననే చిరాకు కలగకూడదు' అని చెప్పి ఇక మరోమాట లేదన్నట్లుగా పుస్తకంలో తలదూర్చేశాడు!"

"సరేలే... ఈ మాత్రం దానికేనా నువ్వంతలా విషాదాన్ని అభినయించేస్తున్నావ్?" శర్మ కోపంగా అన్నాడు.

"సరే లేరా... అంత ఫీలవ్వాల్సిన పనేంలేదులే! వాడూ మనకి ఏదొకరోజు దొరక్క పోతాడా... మనం గట్టిగా ఒక కిక్ ఇవ్వకపోతామా! అయినా తెలిసీ వాడినెందుకురా అడిగావ్?" ప్రకాశం అన్నాడు.

"మొన్ననేగదా నేనూ, కె.ఆర్. నీ దగ్గర తీసుకున్నాం. అందుకని బి.ఎస్.నీ, కె.ఎస్.నీ అడిగా, నెలాఖరు కదా వాళ్ళ దగ్గిరాలేవు" నాగేంద్ర దిగులుగా మొహంపెట్టి అన్నాడు.

ప్రకాశం పర్సులోనుంచి నోట్లు తీసి 'నాగేంద్ర చేతిలో పెట్టాడు. ఆనందంగా 'థేంక్స్' చెప్పాడు. "ఏమైనా నువ్వు నువ్వేరా! మా అందరికీ డబ్బు అటూ ఇటూగా అందుతుంది కానీ నీకు మాత్రం ఫస్టుకి నాలుగు రోజుల ముందే ఠంచన్‌గా మీ భూషయ్యగారు పంపించేస్తారు! చాలా కరెక్టయిన మనిషి! నువ్విలా మా అవసరాలకి ఆదుకోగలుగుతున్నావంటే ఆ క్రెడిట్ అంతా భూషయ్యగారికే చెందుతుంది".

నరహరి నాగేంద్ర మాటల్ని సపోర్టుచేస్తూ అన్నాడు "అంతేకాదురా... ఏ నెలలో అయినా ఎక్కువ కావలసి వస్తే, ఒక మాట రాసి పడేస్తే చాలు, లేదు... కాదు అనకుండా పంపించేస్తారు. మనకయితే ఎందుకు, ఏమిటి అంటూ సవాలక్ష కారణాలడిగ్గానీ పంపించరు. అవును ప్రకాశం... ఆ భూషయ్యగారిగ్గానీ కూతురుందా ఏం? ముందుచూపుతో నిన్ను మంచి చేసుకుంటున్నారేమోనని నాకనుమానం వస్తోంది"

ప్రకాశం నవ్వాడు "అలాంటిదేం లేదురా బాబూ! ఇప్పటివరకూ ఆయన మొహం కూడా చూడలేదు. వాళ్ళింటి సంగతులూ తెలియవు. ఆయన తాలూకు మనుషులు మా ఊళ్ళోని మా భూముల్ని కౌలుకి తీసుకున్నారు. కాబట్టి ఆ కౌలు డబ్బు డైరెక్టుగా నాకు నెలనెలా పంపించే ఏర్పాటు నాన్నగారు చేశారు. తరవాత లెక్క చూసుకోవచ్చని, ఎక్కువ కావాలని రాసినా పంపిస్తారు. అలా కాకపోతే మళ్ళీసారి కౌలుకి వాళ్ళకివ్వరేమోననే భయం ఉంటుందిగా! మరి మా పొలాలన్నీ బంగారం లాంటివి"

"బంగారం లాంటి భూములున్నాయి కాబట్టే నీకిలా దర్జాగా జరుగుతోంది మరి! అయినా డబ్బు ఉండగానే సరిపోదురా, ఎంజాయ్ చేయటం కూడా తెలిసుండాలి. అది అందరికీ చేతకాదులే!"

నరహరి మాటలకు ఒక క్షణం ప్రకాశం మోహం వేయివోల్టుల బల్బులా ప్రకాశవంతమై పోయింది.

* * *

రాత్రి పదకొండు గంటలవేళ...

ఫ్రెండ్స్‌తో కలిసి హాస్టల్ కారిడార్‌లో నడుస్తున్న ప్రకాశం, ప్రభాకరం రూములో లైటు ఇంకా వెలుగుతుండటం చూసి, ఏదో అయిడియా వచ్చిందన్నట్లుగా చిటికేసి లోగొంతుతో "ఒక్క నిముషం...

చిన్న తమాషా చేద్దాం" అంటూ అక్కడ ఆగి తలుపు తట్టాడు. తలుపు తీసిన ప్రభాకరం చిరునవ్వుతో "ఏంట్రా... ఇలావచ్చారూ...?" అన్నాడు.

"ఏం లేదురా... చిన్న సందేహం. ఇక్కడ హాస్టల్‌లో ప్రతిరోజూ పదకొండు గంటలు దాటేవరకూ చదవటం నీ అలవాటు కదా... ఇంటికెళ్ళినప్పుడు మాత్రం ఎగ్జామ్స్ ముందైనా సరే తొమ్మిది దాటాక నీ గదిలో ఎట్టి పరిస్థితులలోనూ లైటు వెలగదని రాంబాబు అంటున్నాడు. కారణం ఏమిట్రా...?" అమాయకంగా మొహం పెట్టి ప్రకాశం అడిగిన ప్రశ్నకి ప్రభాకరం రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. అలా ప్రకాశం ఎందుకు అడిగాడో అర్థమైన వాళ్లంతా లోపలలోపలే నవ్వుకోవడం మొదలుపెట్టారు.

ప్రభాకరం ప్రకాశం వేపు ఒక క్షణం నిశితంగా చూసి, చిరునవ్వుతో అన్నాడు – "ఎందుకంటే, ఇక్కడయితే కరెంటు బిల్లుమనది కాదు. ఇంటి దగ్గరయితే మనమే బిల్ కట్టుకోవాలి. మరి నేను పి.పి.ని గదా!"

పిసినారి ప్రభాకరమనే నిక్‌నేమ్ తనకుందనీ అందుకే అందరూ తనని పి.పి. అంటూంటారని అతనికీ తెలుసు. తమతోపాటూ ప్రభాకరం కూడా నవ్వుతుండేసరికి అందరికీ కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ప్రభాకరం అందరివేపూ చూసి అన్నాడు "మీకో సంగతి చెప్పానా..! పొదుపుకీ, పిసినారితనానికీ తేడా ఉందిరా! ఒకే విధమైన ఖర్చు ఒకడు చేస్తే పొదుపు కిందకు వస్తుంది, మరొకడు చేస్తే పిసినారితనమనిపించుకోవచ్చు. అంటే వాళ్ళ పరిస్థితులను బట్టి ఉంటుంది ఏదైనా!"

ఇదంతా ప్రభాకరం ఎందుకు చెప్పాడు...? అతని పరిస్థితి ఎలాంటిదో తెలుసుకోకుండా తామంతా వేళాకోళం చేస్తున్నామనా...! అతని మాటలు అందరికీ అర్థమయీ, కానట్లుగా అనిపించాయి. ప్రకాశం, ప్రభాకరం భుజంమీద చెయ్యేసి "నీకు అవసరమైనప్పుడు సంశయించకుండా నన్ను అడగరా" అన్నాడు.

"థేంక్స్ రా! డబ్బు ఇస్తానని అన్నందుకు కాదుగానీ, ఎవరైనా నీకు నేనున్నానని చెప్పటం మనకి చాలా ఆనందాన్ని కలిగిస్తుంది." అన్నాడు ప్రభాకరం. ఆ మాటలంటున్నప్పుడు అతని వదనంలో కనిపించిన వెలుగులో, పెదవులపై విరిసిన చిరునవ్వులో ఉన్న అర్థం, పరమార్థం ప్రకాశం అప్పుడు తెలుసుకోలేకపోయాడు.

* * *

హాస్టల్ వెనుకనున్న గార్డెన్‌లో ఉన్న లాన్‌లో మిత్రబృందం సమావేశమయింది.

"నాకీ మధ్యే తెలిసింది. ఎవరో అన్నారు. పి.పి.కూడా ఫస్టియర్‌లో యమదర్జాగా ఉండేవాడట. వాడి బట్టలేమిటీ... బూట్లేమిటీ... యమ స్టైల్ మెయిన్‌టెయిన్ చేసేవాడట! సెకండియర్ దగ్గర్నుండే ఇలా అవతారం మార్చేశాడట!" చక్రవర్తి అన్నాడు.

"నిజమా?" అన్నారందరూ ఆశ్చర్యంగా. "అవును. నిజమేనట. ఫస్టియర్‌లో మనకి వాడితో అంత పరిచయం లేదు కాబట్టి మనకీ సంగతి తెలియలేదు" చక్రవర్తి అన్నాడు.

"ఇదేదో ఇంటరెస్టింగ్‌గా ఉందే! ఆ మార్పుకి కారణం ఏమిటో... ఆ కథ చెప్పమని వాడినే అడుగుదాం" అంటూ ప్రకాశం అటుగా వెళ్తున్న ఒక స్టూడెంట్‌ని పిలిచి ప్రభాకరం రూముకి వెళ్ళి అతన్ని తాము రమ్మని పిలుస్తున్నామనే విషయం చెప్పమన్నాడు.

"ఏంట్రా... పిలిచారు" అంటూ ప్రభాకరం వచ్చి వాళ్ళ పక్కన కూర్చున్నాడు.

"ఈ వేళ నీ బర్త్‌డే అట కదా... నువ్వు మా అందరికీ విందు... కంగారుపడకోయ్... కథ చెప్పి వీనులవిందు చేయాలి" ప్రకాశం చిరునవ్వుతో అన్నాడు.

ప్రభాకరం నవ్వాడు – "నా దగ్గర కథలేముంటాయిరా! నెలకో అమ్మాయిని ప్రేమించే వాడి దగ్గర బోలెడు లవ్‌స్టోరీస్, ప్రతీ తగవుకీ ముందుండే వీడి దగ్గర రకరకాల ఫైటింగు కథలూ ఉంటాయి. వాళ్ళని చెప్పమనండి" అక్కడున్న వాళ్ళలో ఇద్దరిని వేలితో చూపిస్తూ అన్నాడు.

"వీళ్ళ కథలు వినీ వినీ బోర్ కొట్టిందేలే! అందుకే వెరైటీకి ఒక రియల్‌స్టోరీ విందామని నిన్ను పిలిచాం. ఫస్టియర్‌లో నీ వ్యవహారం యమజోరుగా ఉండేదట! అలాంటి జల్సా కుర్రాడు ఆ తరవాత బుద్ధిమంతుడి టైపులోకి ఎందుకు మారిపోయాడూ...? ఆ కథ చెప్పాలి" ప్రకాశం అడిగాడు.

"ఓకే... మీరు కథ చెప్పమని అడుగుతున్నారు కాబట్టి చెబుతాను వినండి. ఫస్టియర్ ఆఖరులో ఒకసారి ఇంటికి రమ్మని నాన్నగారు కబురు చేశారు. వెళ్ళాను. బంధువులతో ఒక వ్యవహారం తేల్చుకోవాల్సి ఉండి నన్ను పిలిపించారు. విషయం చెప్పి ఆ ఊరికి వెళ్ళి రమ్మన్నారు. వెళ్తుంటే మధ్యలో వాహనానికి ట్రబుల్ వచ్చింది..."

"అంటే... కారా...బస్సా... సైకిలా... ఏమిటో చెప్పవేం." ఎవరో అడిగారు.

"ఏదయితేనేం... ఏదో ఒకటి. కథకి అదంత ముఖ్యమైన విషయం కాదుగా! నాకసలే కథలు చెప్పటం రాదు. చెప్పమన్నారని ఏదో చెబుతున్నా. ప్రశ్నలూ... సందేహాలు వద్దు" అంటూ మళ్ళీ చెప్పటం మొదలు పెట్టాడు.

"రిపేరు పూర్తయి నా ప్రయాణం మళ్ళీ కొనసాగాలంటే ఆ ఊళ్ళోనే ఆ రాత్రికి ఉండిపోవాలి. ఆ పల్లెటూళ్ళో ఎక్కడుండాలో ఏమిటో అర్థంకాలేదు. ఇంతలో నా దగ్గరకు సుబ్బారాయుడుగారనే పెద్దమనిషి వచ్చి, సంగతేమిటని అడిగి ఆ రాత్రికి వాళ్ళింట్లో ఉండొచ్చని చెప్పి ఆదరంగా వెంటబెట్టుకుని వెళ్ళారు.

వాళ్ళింటికి వెళ్ళాక ఆయన గదిలోకి వెళ్ళి ఒక అతిథిని భోజనానికి తీసుకువచ్చిన విషయం నెమ్మదిగా చెప్పినట్లున్నారు. వరండాలో చీకటిలో నిలబడిన నన్ను గమనించకుండా ఆవిడ "పిల్ల రెండు రోజుల్నుండీ పచ్చడీ, చారుతో తినలేక కూరచేయమని గోల పెడుతుంటే, చేయలేక దాన్ని బుజ్జగించి ఎలాగో తినిపిస్తున్నాను. మీరేమో ముందు వెనకా ఆలోచించకుండా ఇంకో మనిషిని భోజనానికి పిలిచారా...?" అంటూ వెనక్కి తిరిగి నన్ను చూసి గతుక్కుమని పక్కగదిలోకి వెళ్ళిపోయారు.

వాళ్ళిల్లు చూస్తే ఎవరైనా సంపన్నులనే అనుకుంటారు. అలాంటి వాళ్ళకి కూరా నారాకి కూడా కటకటలాడే పరిస్థితి ఏమిటో మరి! అర్థం కాలేదు. మొత్తానికి ఎలాగైతేనేం ఒక గంటలో వంట పూర్తిచేసి ఆవిడ మాకు వడ్డించారు. రాయుడుగారూ, వాళ్ళమ్మాయి రేఖా, నేను కలిసి భోజనం చేశాం. పచ్చడీ, చారు మాత్రమే కాకుండా రెండు కూరలూ, సేమ్యాపాయసం కూడా ఉన్నాయి. భోజనాలయ్యాక బయట వరండాలో నేను కూర్చున్నప్పుడు రేఖ వచ్చి ఆ మరునాడు కూడా నేను వాళ్ళింట్లో ఉంటానా. అనడిగింది. నేను వెళ్ళిపోతానని చెప్పగానే ఆ అమ్మాయి చాలా నిరాశగా చూసింది. నేను కారణం అడిగితే, ఆ అమ్మాయి 'మీరుంటే రేపు కూడా అమ్మ కూరలు, స్వీటు చేస్తుందిగా' అంది అమాయకంగా. ఆ అమ్మాయి చెప్పిన సమాధానానికి నా మనసు చెదిరిపోయింది.

సుబ్బారాయుడుగారూ, నేనూ బయట వేసిన మంచాలమీద పడుకున్నాం. ఆయన కాసేపు ఆ ఊరి కబుర్లు చెప్పారు. కొంచెం పరిచయం పెరిగినట్లనిపించాక, వాళ్ళ కుటుంబ పరిస్థితి గురించి అడిగాను. ఆయన సందేహిస్తోంటే, కొడుకులా భావించి చెప్పమని అర్థించాను. దాంతో ఆయన ఆత్మీయుడికి చెప్పుకున్నట్లుగా వాళ్ళ పరిస్థితి వివరించారు.

పంటలు సరిగా పండక అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చటంలో ఆస్తిపాస్తులన్నీ కరిగిపోయాయి. మిగిలిన కొద్దిపాటి భూమిమీద వచ్చే ఆదాయంతో భుక్తికి లోటు లేకుండానే జరిగిపోతోంది. కానీ, ఇంతలో కొడుకుని దూరంగా పంపి చదివించాల్సిన అవసరంతో మళ్ళీ అప్పులు పెరుగుతున్నాయి. అలాగే అయితే కొడుకు చదువు పూర్తయ్యేసరికి నిలవ నీడ లేకుండా ఇల్లు కూడా అమ్మాల్సిన పరిస్థితి వస్తుంది. అందుకని ఈ మధ్యనే ఒక నియమం పెట్టుకున్నామని చెప్పారు.

వాళ్ళకి వచ్చే ఆదాయం నుంచి కొడుకు చదువుకోసం అవసరమైనంత వేరే ఉంచి, మిగిలిన దానితోనే గుట్టుగా సంసారాన్ని నెట్టుకొస్తున్నారు. అలా అయితే, కొంతలో కొంత మెరుగుగా కొత్త అప్పులేవీ చేయాల్సిరాదు. ఆ రాత్రి అతిథి మర్యాద కోసం నియమాన్ని ఉల్లంఘించారని నాకు ఆయన చెప్పకుండానే అర్థమైంది. కొడుకు చదువు కోసం ఆ కుటుంబం చేస్తున్న త్యాగానికి నేను నివ్వెరపోయాను.

ఆ మరునాడు నేను వెళ్ళిపోయేటప్పుడు సుబ్బారాయుడుగారికి నేను స్టూడెంట్‌నే అయినా కొందరు ధనవంతులు కలిసి స్థాపించిన సేవాసంస్థలో వాలంటీర్‌గా పనిచేస్తున్నాననీ, ఆ సంస్థ పేద విద్యార్థుల చదువుకీ, ఇళ్ళులేని వాళ్ళు ఇళ్ళు కట్టుకోడానికీ ధనసహాయం అందిస్తుంది. కాబట్టి వాళ్ళబ్బాయికీ ఆ సహాయం వచ్చేట్టుగా చూస్తానని చెప్పాను. దానికాయన ఒప్పుకోలేదు. 'ఇంకో మూడేళ్ళు ఎలాగో కష్టపడితే అబ్బాయి చదువు పూర్తయి అందివస్తాడు. ఇంకొకరి ముందు చేయిచాపటం ఎందుకూ' అన్నారు. వాళ్ళబ్బాయి స్థిరపడ్డాక ఆ డబ్బుని ఆ సంస్థకి విరాళంగా నేనే వచ్చి తీసుకుంటాననీ, లేకపోతే మరో పేద విద్యార్థికి సహాయం చేయడం ద్వారానైనా ఆ రుణం తీర్చుకోవచ్చనీ నచ్చచెప్పాక సరేనన్నారు.

మేం కోటీశ్వరులం కాకపోయినాగానీ నేను అడిగినంతా పంపించగలిగే స్థితిగతులున్నాయి. అయినా మావాళ్ళ మీద భారం వేయకుండా, నేనే నా ఖర్చుల్నీ, దర్జానీ తగ్గించుకుంటే మంచిదనుకున్నా. అందుకే నా ఖర్చుల్ని వీలైనంతవరకూ తగ్గించుకుని మద్రాస్‌లో చదువుతున్న రాయుడుగారి అబ్బాయికి పంపిస్తున్నాను.

అదిగో... అలా ఆ జల్సా అబ్బాయికి ఓ పల్లెటూరిలో... పేద రైతు కుటుంబం మధ్య ఓ రాత్రివేళ జ్ఞానోదయం అయి, 'ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేద'న్న కవిగారి మాటల్లోని నిజాన్ని స్వానుభవంతో తెలుసుకొని ఆనందంగా ఉన్నాడు. కథ కంచికి... మరి నే వెళ్ళనా రూముకి?" చిరునవ్వుతో ప్రభాకరం ముగించాడు.

"ఇలాంటి కథ చెప్పావ్...! మా చెవుల్లో పువ్వులేమైనా కనబడుతున్నాయా..." ఎవరో నటుడిని అనుకరిస్తూ నరహరి అడిగిన ప్రశ్నకి అంతా గొల్లున నవ్వారు. ప్రభాకరం కూడా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

* * *

ఆఖరి సంవత్సరం ఎగ్జామ్స్ పూర్తయ్యాయి.

హాస్టల్‌లోని స్టూడెంట్స్ అందరూ సామాన్లు సర్దుకోవటం... ఫ్రెండ్స్ అడ్రసులూ, ఫోన్ నెంబర్లూ ఇచ్చిపుచ్చుకోడంలో బిజీగా ఉన్నారు.

తన ఫ్రెండ్స్ అందరి అడ్రసులూ తీసుకున్న ప్రకాశం ప్రభాకరం అడ్రసు మాత్రం తీసుకోలేకపోయాడు. అతను దగ్గరలో ఎక్కడా కనిపించకపోయేసరికి, వాడికి శ్రద్ధపెట్టి ఉత్తరం రాయబోతానా ఏంటిలే అనుకుని ఊరుకున్నాడు. కానీ తొందరలోనే అతనికి ఉత్తరం రాయాల్సిన అవసరం వస్తుందని ఊహించలేకపోయాడు.

* * *

రెండు నెలల తరవాత...

ప్రభాకరానికి ఉత్తరం రాసేవరకూ ప్రకాశానికి మనసు స్థిమితపడేట్లుగా లేదు. తన ఫ్రెండ్సందర్నీ వాకబుచేసి అడ్రసు సంపాదించగలిగాడు.

కవరుమీద అడ్రసు రాసి కాగితం తీసుకుని ఉత్తరం రాయబోయేసరికి కళ్ళల్లోకి చేరిన నీటితెర అడ్డం వచ్చింది. కళ్లు తుడుచుకుని రాయటం మొదలుపెట్టాడు.

డియర్ ప్రభాకర్

కాలేజి నుండి వచ్చేసేటప్పుడు నీ అడ్రసు తీసుకోలేకపోయాను. (ఇప్పుడు ఎలాగో సంపాదించగలిగాననుకో) అప్పుడు మరి నాకు తెలియదుగా, నేను జన్మంతా గుర్తుంచుకోదగ్గ వ్యక్తివి నువ్వని!

రెండు రోజుల క్రితం నా పెన్ కనిపించక చెల్లెలు సీత పెన్ తీసుకున్నా, ఆ పెన్ తనకి ఒక అన్నయ్య గిఫ్టుగా ఇచ్చింది కాబట్టి జాగ్రత్తగా దాచుకుంటున్నానని చెప్పి తిరిగి ఇచ్చేయమని అంది. ఎవరని అడిగా, 'మన వీధిలోనే ఆ అన్నయ్య కారు ఆగిపోతే, నాన్నగారు మనింటికి తీసుకువచ్చారు. ఆ మరునాడు వెళ్ళిపోయేటప్పుడు నాకీ పెన్ ఇచ్చారు' అని సీత చెబుతోంటే నా మనసులో ఏదో మెరుపు మెరిసినట్లయింది!

నాన్నగారి దగ్గరకు వెళ్ళి వివరమడిగాను. మూడేళ్ల కిందట సంగతంటూ నాన్నగారు నువ్వు మాకు చెప్పిన కథనే చెప్పారు! పేర్లూ, ప్రదేశాలూ మార్పుతో నువ్వు నిజమైన కథనే చెప్పావన్నమాట! ఆ మద్రాస్ స్టూడెంట్‌ని నేనేనని అర్థమైన ఆ క్షణాలలో... నా మనఃస్థితి ఎలావుందో మాటల్లో చెప్పలేను!

సేవాసంస్థ విరాళంతో చదువుకుంటున్నాననే విషయం తెలిస్తే మనసు కలతపడి సరిగా చదవలేకపోతానని, అందుకని నాకీ విషయం ఎట్టి పరిసస్థితులలోనూ తెలియనివ్వొద్దని నాన్నగారి దగ్గర మాట తీసుకున్నావట! అందుకే నువ్వు చెప్పమన్నట్లుగానే నాకు మా పొలం కౌలుకి తీసుకున్న భూషయ్యగారు పంపిస్తారని చెబితే నిజమని అనుకున్నాను. ఆయన మీ గుమాస్తా అనీ ఆయన ద్వారా నాకు పంపించే ఏర్పాటు చేశావనీ ఇప్పుడే తెలిసింది.

నేను కాలేజీలో చేరటానికి మొదటిసారిగా ప్రయాణమై వస్తున్న రోజు నాన్నగారు 'పరిస్థితులు... జాగ్రత్త' అని ఏదో చెప్పబోతుంటే, నాకు చాలా చిరాకు వచ్చేసింది. "సవ్యంగా చదివించగలిగితే చదివించండి. లేకపోతే చెప్పేయ్యండి... మీతో పాటూ ఇక్కడే పొలం దున్నుకుంటూ బతుకుతాను.

అంతేకానీ నలుగురిలో చిన్నతనంగా పైసాపైసా లెక్కచూసుకుంటూ చదవడం నావల్లకాదు" అంటూ సూట్‌కేసును అవతలకి తోసేశాను. అమ్మా, నాన్న సముదాయించి పంపించారు. అందుకేనేమో ఇక ఎప్పుడూ పెరుగుతున్న అప్పుల గురించి గానీ, ఇంటి పరిస్థితి గురించిగానీ నాకు చెప్పనేలేదు!

మన కాలేజీ రోజుల్లోని మామాటలూ, చేష్టలూ తలుచుకుంటుంటే... నా తల భూమిలోకి వంగిపోతోంది! మా మాటలకి నువ్వెప్పుడూ బాధపడేవాడివి కాదు! చిరునవ్వు ఆయుధంతోనే ఎదుర్కొనేవాడివి! నీ వదనంలో కనిపించే ఆ దరహాసపు వెలుగుకి కారణం... ఒకరికి సహాయపడటంలో కలిగే ఆత్మతృప్తీ, ఆనందమే అని నాకిపుడు అర్థమైంది!

నీ సహృదయతకీ, సంస్కారానికీ తలవంచి అభివాదం చేస్తున్నాను. 'మిత్రమా... మన్నించు" అంటూ నా మనసు వేయిగొంతులతో నిన్ను అర్థిస్తోంది. నా మనసులోని ఈ ఘోషని నీముందుంచాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. నువ్వు చెప్పినట్లుగా... నువ్వు చూపిన బాటలోనే పయనించి మరొకరికి సాయం చేయటం ద్వారానే నీ రుణం తీర్చుకోవటానికి ప్రయత్నిస్తాను. ఇప్పుడు నా మనసులో అలల్లా ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కృతజ్ఞతా, స్నేహభావం మాత్రం ఎప్పటికీ ఇలాగే ఉంటాయ్! ఇది నిజం!

నేస్తమా... నన్ను మన్నిస్తావు కదూ అని మరోసారి కోరుతూ ముగిస్తున్నాను.

నీ ఫ్రెండ్... ప్రకాశం.

ఈనాడు ఆదివారం. 13, జనవరి, 2002.